

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 304 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 06, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# ఆధునిక యుగంలో.. అంతుచిక్కని సమస్యలు



- దేశంలో పెరిగిపోతున్న సమస్యలు
- దేశాన్ని పూర్తిగా నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు
- దినదినం పెరిగిపోతున్న అరాచకాలు
- లైంగిక వేధింపుల ఢిల్లీ పోలీస్ అధికారికి పదోన్నతి
- విద్యార్థి మేధావులను చితక్కొడుతున్నారు
- దేశంలో పెరిగిపోతున్న ఉద్యమాలు
- అంతుచిక్కని సమస్యలను సృష్టిస్తున్న ఆర్ఎస్ఎస్
- దేశ దనాన్ని అక్రమంగా దోచుకుంటున్నారు
- దేశ ప్రజలు అల్లాడుతుంటే ఆనంద పడుతున్న మోడీ
- దేశ ప్రజలను కిరాతకంగా కొట్టిస్తున్న అమిత్ షా
- ప్రజల ఉసురు పోసుకుంటున్న బిజెపి నేతలు
- మత గొడవలపై చిచ్చులు రేపుతుంది ఆర్ఎస్ఎస్ మాత్రమే
- డాక్టర్ బరిగెల శివ







దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న సమస్యలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని డాక్టర్ బరిగెల శివ అన్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాల్సిన ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా అణచివేత ధోరణులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. విద్యార్థులు, మేధావులు, మహిళలు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిపై కేసులు, అరెస్టులు, దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఇంధన ధరలు, గ్యాస్ ధరలతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న రుణాలను తిరిగి చెల్లించలేక పేదలు ఇబ్బందులు పడుతుంటే భారీ రుణాలు తీసుకున్న పారిశ్రామికవేత్తలకు రుణమాఫీలు చేయడం అన్యాయమని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలు, ఎన్నికల సంస్థల పనితీరుపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మత విద్వేషాలు, సామాజిక విభజనలు, ప్రజా ఉద్యమాల అణచివేత దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించేందుకు దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## కులం ఆధారంగా ఖైదీలకు పనుల కేటాయింపు సరికాదు

జైళ్లలో కుల వివక్షకు తావులేదు.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

కులం ఆధారంగా పనుల విభజన రాజ్యాంగ విలువలకు విరుద్ధం

పారిశుద్ధ్య పనులను నిర్దిష్ట వర్గాల ఖైదీలకే కేటాయించడం సరికాదు

ప్రతి ఖైదీకి సమానత్వం, మానవ గౌరవం ఉండాల్సిందే

కుల వివక్షకు అవకాశం కల్పించే జైలు నిబంధనలను పునఃపరిశీలించాలి

3



## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్

తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు

బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి

రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ వేళ పరిణామం

ఇంప్లీడ్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు

2



## కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వత వన్‌వే

వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేసిన జీహెచ్ఎంసీ

పాత ప్రాజెక్టులో మార్పులతో రూ.400 కోట్ల ప్రజాధనం ఆదా

నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు స్టీల్ ఫ్లైఓవర్

ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం

కేబీఆర్ పార్క్ వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు



## ఇంటింటికీ జలధార.. రూ.30,156 కోట్లతో బృహత్ పథకం

ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం

రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు

రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు

గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ

గత ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు

2

## సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

సీఎం రేవంత్, నటి సురేఖావాణిపై అసభ్యకర పోస్ట్

'డిగ్‌టీవీ తెలుగు' ప్యారడీ ఎక్స్ ఖాతాపై కేసు

సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత

సీఎం ప్రతిష్ఠకు, నటి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్

కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

3



జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

# ఆధునిక "యుగంలో" అంతు చిక్కని సమస్యలు

**దేశంలో పెరిగిపోతున్న సమస్యలు**
**దేశాన్ని పూర్తిగా నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు**
**దినదినం పెరిగిపోతున్న అరాచకాలు**
**లైంగిక వేధింపుల ఢిల్లీ పోలీస్ అధికారికి పదోన్నతి**
**విద్యార్థి మేధావులను చితక్కొడుతున్నారు**
**దేశంలో పెరిగిపోతున్న ఉద్యమాలు**
**అంతుచిక్కని సమస్యలను సృష్టిస్తున్న ఆర్ఎస్ఎస్**
**దేశ దనాన్ని అక్రమంగా దోచుకుంటున్నారు**
**దేశ ప్రజలు అల్లాడుతుంటే ఆనంద పడుతున్న మోడీ**
**దేశ ప్రజలను కిరాతకంగా కొట్టిస్తున్న అమిత్ షా**
**ప్రజల ఉసురు పోసుకుంటున్న బిజెపి నేతలు**
**మత గొడవలపై చిచ్చులు రేపుతుంది ఆర్ఎస్ఎస్ మాత్రమే**
**డాక్టర్ బరిగెల శివ**



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో పెరిగిపోతున్న సమస్యల పట్ల దేశ పాలకుల కుట్రలు బయటపడుతున్నాయని డాక్టర్ బరిగెల హెచ్చరించారు. పేద ప్రజల బ్రతుకులు బాగు చేయాల్సిన ప్రభుత్వాలు పేద ప్రజలపై దాడులు చేయిస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలు అభివృద్ధిని అడుగుతున్న ప్రతి రాష్ట్రంలో అనుకోని రీతిగా ప్రజలపై దాడులు జరుగుతున్నాయని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలే సమస్యలు ,సమస్యలను సృష్టిస్తూ, సమస్యల పరిష్కారం మార్గంలో ప్రజల జీవితాలతో చెలగాటలాడుతున్నారని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన ఆర్ఎస్ఎస్ రిజిస్ట్రేషన్ లేకుండా వేల కోట్ల రూపాయల పోగుచేస్తూ ప్రభుత్వాలకు పన్నులు చెల్లించకుండా ఆర్ఎస్ఎస్ వ్యవస్థలను, సంస్థలను నడిపిస్తూ ప్రజా సొమ్మును అక్రమంగా, అప్పనంగా దోచుకోవడం తీవ్రమైన నేరం అన్నారు. దేశాన్ని మతం పిచ్చిలో ముం చుతుండడమే దేశ పాలకుల లక్ష్యంగా పరిపాలన అనేది ముందుకు సాగుతుండగా దేశ ప్రజల బ్రతుకులు బాగుపడేదెలా అంటూ సూటిగా ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరు మీద వేలాదిమంది నక్సలైట్లను, నక్సలైట్ల సానుభూతిపరులను ఎన్కౌంటర్లు చేసిన కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం దేశంలో అరాచక పాలనపై ఎదురు తిరుగుతూ ప్రశ్నిస్తున్న యువతను చిత్రవధకు గురి చేయడమే కాకుండా మహిళల పట్ల విద్యార్థినిల పట్ల అసభ్యకరంగాను ప్రవర్తిస్తూ ఆడపిల్లల భవిష్యత్తుపై అశలు లేకుండా చేస్తున్నారని హెచ్చరించారు. దేశంలో జరుగుతున్న ధర్నాలతో దేశపాలకు ఒక్కసారిగా భయం పట్టుకుందని ఒకవైపు పార్లమెంట్లో బిజెపి అగ్ర నేతలపై జరుగుతున్న ఎదురుదాడులను, వ్యతిరేక చర్చలను ఎదుర్కోలేక పార్లమెంటుకు గైర్హాజరవ్వడమే కాకుండా హాజరవుతున్న సందర్భంలో మారు మాట మాట్లాడకుండా ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ముఖం చాటేస్తున్న అగ్ర నేతలను దేశ ప్రజలు చిదరించుకుంటున్నారని మండిపడ్డారు. 13 కోట్ల ఓట్లు తొలగిస్తే గాని దేశంలో బిజెపి గెలవలేకపోయిందని ఓట్లు తొలగించడం వల్ల ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా సహకరించడం వలన బిజెపి మూడోసారి అధికారంలోనికి వచ్చిందని అందువల్లనే బిజెపి సానుభూతిపరులు దేశంలో జరుగుతున్న నిరసన ధర్నాల పట్ల దాడులు నిర్వహిస్తున్నారని బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న దేశ యువతను దేశంలోని మేధావులను చిత్రహింసలు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని ఒకవైపు మఫ్టీలలో మరోవైపు పోలీస్ బలగాల రూపంలో యూనిఫామ్ లు ధరించి ధర్నా చేస్తున్న విద్యార్థులను విచక్షణ రహితంగా కొడుతున్నారని హెచ్చరించారు.

**ఆర్థిక భారాన్ని భరిస్తున్న పేదలు..**

దేశంలో ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు వాటిని అనుభవించాల్సింది రైతులు మొదలుకొని కూలీలు, కార్మికులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, పార్ట్ టైం, కాంట్రాక్టు ఉద్యోగులు, నిరుపేదలు,పలువురు పేదల సామాజిక వర్గానికి చెందిన ప్రజలంతా ప్రభుత్వాల ద్వారా పొందుకున్న చిన్నపాటి లాభాలకు చిన్నపాటి లోన్లకు భయంకరమైన కష్టాలు అనుభవిస్తూ వాటిని తిరిగి చెల్లించలేని పరిస్థితిలో ప్రాణాలు తీసుకుంటున్నారని అన్నారు. అదే సందర్భంలో వేలాది కోట్ల రూపాయలు లక్షలాది కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకున్న పారిశ్రామికవేత్తలు,బడా వ్యాపారస్తులు మాత్రం,ఒకవైపు పన్నులు చెల్లించకుండా మరొకవైపు తీసుకున్న రుణాలకు నష్టాలను చూపిస్తూ వేల కోట్ల రూపాయలను మాఫీ పొందుతూ వాటి భారాన్ని పేద ప్రజలపై తోస్తున్నారని మండిపడ్డారు.

**దేశంలో పెరిగిపోతున్న చోరీలు..**

ప్రస్తుతం దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న సమస్యలతో పాటు అయోధ్య రామాలయంలో పెరిగిపోతున్న దొంగతనాలు ఇప్పటివరకు 105 సార్లు దొంగతనాలు జరిగినట్లు సిబిఐ తమ నివేదికలో పొందుపరిచినప్పటికీ దొంగతనాలు చేసిన వ్యక్తులు యదేచ్ఛగ బయట తిరుగుతున్నారు తప్ప చట్టపరంగా ఎందుకు శిక్షను అనుభవించడం లేదంటూ సూటిగా నిలదీశారు దీన్ని బట్టి చూస్తే ఉత్తర ప్రదేశ్ లోని ప్రభుత్వమే ఆలయంలోని దొంగతనాలను చేయించినట్లుగా స్పష్టంగా వెల్లడవుతున్నట్లు తెలిపారు. నిధుల దోపిడీకి ఆర్థిక శాఖ మంత్రి ప్రధాన కారణంగా భావించాల్సి వస్తుండగా దేశంలో పేద ప్రజల సొమ్మంతా ధనికులకు రుణమాఫీ చేయడంలో దగ్గర ఉండి సంతకాలు చేస్తున్న దేశ ఆర్థిక శాఖ మంత్రి వేలకుంట్ల రూపాయలను లక్షల కోట్ల రూపాయలను ఎందుకు మాఫీ చేస్తుందంటూ సూటిగా ప్రశ్నించారు. దేశంలో పెరిగిపోతున్న సమస్యలు దృష్ట్యా గ్యాస్ సిలిండర్ల ధరలు మళ్ళీ పెరిగిపోయాయని, పెట్రోల్ డీజిల్ ధరలు లెక్కలేనంతగా పెరిగాయని నిందించారు. పేదలు జీవించడానికి ఉపయోగించుకుంటున్న నిత్యవసరాల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోవడంతో పేద ప్రజలు ఆహారం తినడానికి సరిపడా నిత్యవసరాలను కొనుగోలు చేసుకోలేక పస్తులతో బ్రతుకుతున్నారు అన్నారు. ఓటు చోరీ జరుగుతున్న ప్రతి రాష్ట్రంలో బిజెపి మాత్రమే గెలుస్తుందని ఎన్నికల విధివిధానాలను బిజెపి పార్టీ అనుకూలత కోసం సిద్ధపాటు చేస్తున్న జాతీయ ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దేశవ్యాప్తంగా కోట్ల ఓట్లను తొలగించి భారత రాజ్యాంగంపై దాడి చేశాడని దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే అంటూ హెచ్చరించారు. ఇప్పటికే కేరళ ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్ పై విచారణకు ఆదేశించగా అదే తరహాలో సుప్రీంకోర్టులో పలు కేసులు నమోదు చేయబడగా జ్ఞానేశ్ కుమార్ పై విచారణకు ఆదేశించిన దేశంలోని అత్యున్నత న్యాయస్థానం జ్ఞానేష్ కుమార్ నిర్వహించిన ఎన్నికల విధానాలపై ఎక్కడలేని అనుమానాలను, అభియోగాలను,ఆధారాలను పరిగణలోనికి తీసుకొని 2023 సంవత్సరం నుండి 2026 సంవత్సరం వరకు జ్ఞానేశ్ కుమార్ నిర్వహించిన ప్రతి ఎన్నికలపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశిస్తూ కఠినమైన చర్యలకు సంసిద్ధమవుతుండగా ఇప్పటికే పశ్చిమబెంగాల్ ఎన్నికలు రిగ్గింగ్ తో పాటు జాతీయ ఎన్నికల కమిషన్ దౌర్జన్యాలు జరిగినందునే బీజేపీ పార్టీ అక్రమంగా అధికారంలోకి రాగలిగిందని అంతేకాకుండా ప్రతి రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న కౄరమైన ఎన్నికల విధానాలతో ప్రతి ఎన్నికల్లో బిజెపిని గెలిపిస్తుందని అన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని పతనం చేస్తున్నారు..**

కేవలం బిజెపి పార్టీకి అండగా నిలవడం కోసం దేశంలో అన్ని ప్రభుత్వ శాఖలతో పాటు న్యాయస్థానాలు జాతీయ ఎన్నికల కార్యాలయాలు సంపూర్తిగా సహకరిస్తున్నాయని మండిపడ్డారు. స్వయం శక్తి కలిగిన సంస్థలు కూడా రాజకీయ పార్టీలకు పూర్తిస్థాయిలో మద్దతు తెలపడం దేశంలో మొట్టమొదటిసారిగా చూస్తున్నామన్నారు. ఇంచుమించు రాక్షస సామ్రాజ్యాన్ని స్థాపిం చుకున్న కొన్ని వ్యక్తిగత సంస్థలు దేశంలో అలజడులను సృష్టించడమే కాకుండా పేద ప్రజలను అణగారిన వర్గాల ప్రజల ఉసురు పోసుకుంటున్నారని అలాంటి దుర్మార్గమైన సంస్థలలో పనిచేస్తున్నది ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగులేనని మండిపడ్డారు. అందులో భాగంగానే ప్రభుత్వ వ్యవస్థలను ఒక వైపు నాశనం చేస్తూ భవిష్యత్ తరానికి భావితరాలకు ఏలాంటి అభివృద్ధిని అవకాశాలను లేకుండా చేస్తూ దేశాన్ని దోచుకోవడం కోసం తీవ్రంగా అరాటపడుతున్నారని హెచ్చరించారు. వానికి అనుకూలంగా ఉంటూ ఢిల్లీ జంతర్ మంతర్ ప్రాంతంలో మహిళలను విద్యార్థులను అసభ్యకరంగా తాకుతూ అక్రమ అరెస్టులకు పాల్పడుతూ తీవ్రమైన అణచివేతకు పూనుకున్న పోలీసు అధికారికి పదోన్నతి కల్పిస్తూ ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా పెద్ద దుమారాన్ని రేపిందని అన్నారు. పేద ప్రజల జీవితాలను నాశనం చేస్తూ పేద ప్రజల ఓట్లను తొలగిస్తూ దేశంలో ఎన్నికల సరళని ఎన్నికల విధానాలను గుప్పిట్లో పెట్టుకుని రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా చట్టాలకు విరుద్ధంగా న్యాయస్థానాలకు విరుద్ధంగా దేశ పరిపాలనను కొనసాగిస్తూ దేశంలో అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని దేశాన్ని దుర్మార్గాల వైపు దౌర్జన్యాల వైపు నడిపిస్తున్న మోడీ అమిత్ షాలను తక్షణమే గద్దె దించాలని లేదంటే ఇదే తరహాలో దేశ ప్రజల ఉసురు పోసుకుంటూ దేశాన్ని నాశనం చేయగలరని ఏదేమైనా దేశంలో అంత చిక్కని సమస్యలను సృష్టిస్తూ దేశాన్ని అధోగతి పాలు చేస్తూ పూర్తిగా నిర్వీర్యం చేసే వరకు దుర్మార్గపు పాలకుల ఆశయాలు నెరవేరేలా లేవని పరోక్షంగా హెచ్చరించారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వత వన్‌వే

**వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేసిన జీహెచ్ఎంసీ**
**పాత ప్రాజెక్టులో మార్పులతో రూ.400 కోట్ల ప్రజాధనం ఆదా**
**నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు స్టీల్ ఫ్లైఓవర్**
**ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం**
**కేబీఆర్ పార్క్ వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు**

**హైదరాబాద్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది. సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్‌ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## ప్రజావాణిలో పెట్రోల్ పోసుకున్న ఘటనపై పిటిషనర్ వాగ్మూలం

**సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది.. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో పిటిషన్ సమర్పించిన దుగ్గొండి మండలం పోనకల్ గ్రామానికి చెందిన గట్ల సురేందర్ సోమవారం ఆవేదనకు గురై పెట్రోల్ పోసుకున్న ఘటన కలకలం రేపింది. ఘటన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిటిషనర్‌తో మాట్లాడి సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడంతో పాటు ఆయన నుంచి స్వయంగా వాగ్మూలాన్ని నమోదు చేయించారు. గట్ల సురేందర్ తన సమస్యకు సంబంధించి 2026 జూలై 6న ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆగస్టు 22న జిల్లా కలెక్టరేట్‌లో విచారణ నిర్వహించారు. ఈ విచారణకు పిటిషనర్ తమ్ముడు గట్ల రాజు హాజరయ్యారు. విచారణ సందర్భంగా సంబంధిత అంశంపై నర్సంపేట సివిల్ జడ్జి కోర్టులో కేసు నంబర్ 199/224 పెండింగ్‌లో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సెప్టెంబర్ 30న ఎండార్స్‌మెంట్ ద్వారా పిటిషనర్‌కు తెలియజేశారు. అయితే సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గట్ల సురేందర్ తీవ్ర ఆవేదనకు గురై పెట్రోల్ పోసుకున్నాడు. అనంతరం తన చర్య పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ, ఇకపై ఇలాంటి పొరపాటు పునరావృతం చేయనని, తనను క్షమించాలని కోరుతూ స్వయంగా వాగ్మూలం రాసి జిల్లా అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. సమస్యకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడే వరకు సంయమనం పాటించాలి అని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆశ్రయించాలని, ఆవేశానికి లోనై తమకు లేదా ఇతరులకు ప్రమాదం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ఇంటింటికీ జలధార.. రూ.30,156 కోట్లతో బృహత్ పథకం

**ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం**
**రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు**
**రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు**
**గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ**
**గత ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు**

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్):**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్. సవిత, పి. నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**రిజిస్ట్రేషన్-స్టాంప్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షురాలిగా తస్లీమా మహ్మద్ ఏకగ్రీవ ఎన్నిక**
**చిట్స్ రిజిస్ట్రార్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తస్లీమా మహ్మద్**
**హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నిక**
**ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ**
**శాఖ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు**



**హన్మకొండ, (జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షురాలిగా ఉమ్మడి వరంగల్ పరిధిలోని చిట్స్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో తస్లీమా మహ్మద్‌ను అసోసియేట్ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి జి. వెంకటేశ్వర్లు, ౧+గా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటించారు. అనంతరం ఆమెకు నియామక పత్రాలను అందజేశారు. రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తస్లీమా మహ్మద్‌కు అసోసియేషన్‌లో బాధ్యతలు అప్పగించడంపై పలువురు గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు సహచర అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తస్లీమా మహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, ప్రజల అవసరాలు, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఉద్యోగులపై ప్రత్యేక బాధ్యత ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉద్యోగులు వారధిగా పనిచేస్తూ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న పని భారం, పరిపాలనా ఇబ్బందులు, విధి నిర్వహణలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అసోసియేషన్ వేదికగా సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంతో పాటు శాఖ అభివృద్ధికి కూడా తన వంతు సహకారం అందిస్తానని తస్లీమా మహ్మద్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అసోసియేట్ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# కులం ఆధారంగా ఖైదీలకు పనుల కేటాయింపు సరికాదు






**జైళ్లలో కుల వివక్షకు తావులేదు.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
**కులం ఆధారంగా పనుల విభజన రాజ్యాంగ విలువలకు విరుద్ధం**
**పారిశుద్ధ్య పనులను నిర్దిష్ట వర్గాల ఖైదీలకే కేటాయించడం సరికాదు**
**ప్రతి ఖైదీకి సమానత్వం, మానవ గౌరవం ఉండాల్సిందే**
**కుల వివక్షకు అవకాశం కల్పించే జైలు నిబంధనలను పునఃపరిశీలించాలి**

**న్యూఢిల్లీ (జై భీమ్ న్యూస్):**

జైళ్లలో ఖైదీలకు కులం ఆధారంగా పనులు కేటాయించే విధానంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఖైదీలను వారి కులం ఆధారంగా వేరు చేసి, కొన్ని వర్గాలకు మాత్రమే శుభ్రపరిచే పనులు, మరుగుదొడ్లు కడిగే పనులు అప్పగించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని స్పష్టం చేసింది. జైళ్లలో ఖైదీలకు పనులు కేటాయించే సమయంలో కులాన్ని ప్రాతిపదికగా చేసుకోవడం ఏమాత్రం సమర్థనీయం కాదని కోర్టు పేర్కొంది. ఒక వర్గానికి చెందిన ఖైదీలను మాత్రమే పారిశుద్ధ్య పనులకు పరిమితం చేయడం, మరో వర్గానికి చెందిన ఖైదీలకు వంట వంటి పనులు కేటాయించడం ద్వారా కుల వివక్షను కొనసాగించకూడదని స్పష్టం చేసింది. ఖైదీ జైలులో శిక్ష అనుభవిస్తున్న వ్యక్తి అయినప్పటికీ, అతని ప్రాథమిక హక్కులు పూర్తిగా రద్దు కావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జైలు నిబంధనల పేరుతో కుల వివక్షకు అవకాశం కల్పించడం రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. కులం ఆధారంగా ఒక ఖైదీకి తక్కువ స్థాయి పని, మరో ఖైదీకి గౌరవప్రదమైన పని కేటాయించడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది. జైళ్లలో పనిచేసే విధానం ఖైదీ సామర్థ్యం, పని స్వభావం, జైలు నిర్వహణ అవసరాల ఆధారంగా ఉండాలి తప్ప కులం ఆధారంగా ఉండకూడదని స్పష్టం చేసింది. సమాజంలో కుల వివక్షను నిర్మూలించాల్సిన అవసరం ఉన్న సమయంలో జైళ్లలోనే కులం ఆధారంగా పనుల విభజన కొనసాగడం ఆందోళనకరమైన విషయమని కోర్టు వ్యాఖ్యానించింది. అంటరానితనం, కుల ఆధారిత వివక్ష రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేసింది. జైలు గోడల మధ్య ఉన్నప్పటికీ ప్రతి ఖైదీ మానవ గౌరవంతో జీవించే హక్కును కలిగి ఉంటాడని కోర్టు పేర్కొంది. కులం పేరుతో అవమానకరమైన లేదా వివక్షపూరితమైన పనులను నిర్దిష్ట వర్గాల ఖైదీలకు మాత్రమే కేటాయించే విధానాలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందని తెలిపింది. కుల ఆధారిత వివక్షకు అవకాశం కల్పించే జైలు నిబంధనలు ఉంటే వాటిని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఖైదీలందరినీ సమానంగా చూడడంతో పాటు, వారికి కేటాయించే పనుల్లోనూ సమానత్వం పాటించాలని సూచించింది. కులం ఆధారంగా మనిషి గౌరవాన్ని నిర్ణయించే రోజులకు ముగింపు పలకాల్సిందేనన్న బలమైన సందేశాన్ని సుప్రీంకోర్టు ఇచ్చింది. జైలు అయినా.. సమాజం అయినా.. కుల వివక్షకు, అంటరానితనానికి తావు ఉండకూడదు. రాజ్యాంగం ముందు ప్రతి మనిషీ సమానమే.

# బుద్ధ వందనతో మంద అనసూర్యకు ఘన నివాళి

**త్రిశరణ, పంచశీలతో పుణ్యస్మరణ కార్యక్రమం..**
**అనిత్యత్వం, దుఃఖ నివారణపై బౌద్ధ భిక్షువు సద్దారఖీత బోధనలు**

**హన్మకొండ,5 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్):**



కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఆచార్య మంద సారంగపాణి, మంద చంటయ్య, సరళల తల్లి మంద అనసూర్య (భర్త కొమురయ్య) పుణ్యస్మరణ కార్యక్రమం బౌద్ధ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. సెప్టెంబర్ 27న ఆమె మృతి చెందగా, అక్టోబర్ 5న తొమ్మిదో రోజు పుణ్యస్మరణ కార్యక్రమాన్ని హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో నిర్వహించారు. బౌద్ధ విహార్‌కు చెందిన భిక్షువు సద్దారఖీత ఆధ్వర్యంలో త్రిశరణ, పంచశీలతో బుద్ధ వందనం నిర్వహించారు. అనంతరం మానవ జీవితంలోని అనిత్యత్వం, దుఃఖానికి కారణాలు, దుఃఖ నివారణ మార్గాలు, మరణం సహజత్వం వంటి అంశాలపై బోధనలు చేశారు. ప్రకృతి సిద్ధంగా జన్మించిన ప్రతి జీవికి వృద్ధాప్యం, మరణం తప్పనిసరి అని, పుట్టుక--జీవితం--మరణం ప్రకృతి ధర్మంలో భాగమని బౌద్ధ బోధనలు తెలియజేస్తున్నాయని సద్దారఖీత వివరించారు. జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే వాస్తవాన్ని అర్థం చేసుకోవడం ద్వారా దుఃఖాన్ని అధిగమించే మార్గాన్ని మనిషి కనుగొనగలడని పేర్కొన్నారు. కోపం, ద్వేషం, అహంకారాలను విడనాడి కరుణ, ప్రేమ, సేవాభావంతో జీవించడం ద్వారా మానవ జీవితం సార్థకమవుతుందని తెలిపారు. మరణించిన వారి జ్ఞాపకాలను గౌరవిస్తూ వారు చూపిన మంచి మార్గాలను కొనసాగించడం, కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. "జీవితం అనిత్యం.. ధర్మమే శాశ్వతమైన మార్గదర్శకం" అనే బుద్ధుని బోధనను గుర్తుచేస్తూ, ప్రతి మనిషి ప్రకృతి ధర్మాన్ని అర్థం చేసుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షువు సద్దారఖీత, ఉపాసకులు డా. ఎం. మల్లయ్య, దమ్మచారి, కామెర లక్ష్మణ్, ఆచార్య గాదే సమ్మయ్య, డా. సునీత, డా. రెడ్యానాయక్‌తో పాటు కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**దళారులను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దు: డీఎంహెచ్‌ఓ డా. బి. రాజా రెడ్డి**



**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలోని వివిధ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి తెలిపారు. కమిషనర్, వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి సర్క్యులర్ మేరకు వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అనుమతితో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం అక్టోబర్ 9వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నియామక ప్రక్రియను మెరిట్, రోస్టర్, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, విధానాల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ నియామకాల విషయంలో ఎలాంటి వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను ఆశ్రయించి డబ్బులు చెల్లించి మోసపోవద్దని అభ్యర్థులను డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేయడం, తప్పుడు నియామక ఉత్తర్వులు చూపించడం వంటి ఘటనలు తమ దృష్టికి వస్తే సంబంధిత ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి ఎటువంటి నియామక నోటిఫికేషన్ జారీ కాలేదని, అలాగే ఈ కార్యాలయం ద్వారా ఎవరికీ నియామక ఉత్తర్వులు జారీ చేయలేదని డా. రాజా రెడ్డి స్పష్టం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించిన నియామకాలు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) పరిధిలో ఉంటాయని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి తమ కార్యాలయంలో ఎటువంటి ఫిర్యాదు కూడా నమోదు కాలేదని పేర్కొన్నారు. అభ్యర్థులు అధికారికంగా వెలువడే నోటిఫికేషన్లను మాత్రమే నమ్మాలని, అనధికార వ్యక్తులు, దళారుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి సూచించారు.

# ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

**పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హన్మకొండ, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందుతున్న వినతులను వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి వినతులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌కు వచ్చిన వినతులతో పాటు జిల్లాలోని ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నమోదైన అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లతో వర్చువల్ విధానంలో మాట్లాడిన కలెక్టర్.. తమ పరిధిలోని ప్రజావాణి అర్జీలపై తీసుకున్న చర్యలను సమీక్షించి, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లా కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార బాధ్యతలను ప్రత్యేకంగా ఒక అధికారికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తుపై చర్యలు తీసుకుని, పరిష్కారానికి సంబంధించిన నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కాగా, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలతో పాటు ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు మొత్తం 254 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి తగిన శిక్షణ ఇవ్వాలి : ఎంఈఓ ఏ. శ్రీనివాస్



**హసన్‌పర్తి, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల్లో దాగి ఉన్న సహజ నైపుణ్యాలు, ఆసక్తులను గుర్తించి వాటికి అనుగుణంగా తగిన శిక్షణ అందించాలని హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఏ. శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలంలోని స్కిల్ స్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న కౌశల్ బోధ్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంఈఓ ఏ. శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన వృత్తి విద్యా బోధకులు, ఎంపిక చేసిన సుమారు 120 మంది ఉపాధ్యాయులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ఉన్న సహజ సామర్థ్యాలు, ఆసక్తులు, నైపుణ్యాలను ఉపాధ్యాయులు నిశితంగా గమనించి వారిని ప్రోత్సహించాలని అన్నారు. అకడమిక్ విద్యతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాలను అందించడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు సహజంగానే వివిధ వృత్తి నైపుణ్యాల పట్ల ఆసక్తి చూపుతారని, ఆ ఆసక్తిని గుర్తించి సరైన దిశలో తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. చేసి నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరింతగా పెంపొందుతాయని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించడం, వృత్తి విద్యా బోధనలో అనుసరించాల్సిన పద్ధతులు, ప్రాయోగిక అభ్యాసం తదితర అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన జిల్లా రిసోర్స్ ఉపాధ్యాయులు, వృత్తి విద్యా బోధకులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 248 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 90, జీడబ్ల్యూఎంసీకి 61, హౌసింగ్ శాఖకు 13, డీఆర్డీవోకు 24, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులు వచ్చాయి. అందిన ప్రతి దరఖాస్తును వెంటనే సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి, సమస్య తీవ్రతను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డీఆర్డీవో శాఖలకు సంబంధించిన సమస్యలపై అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులకు అధికారులు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను సమీక్షిస్తూ పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు వచ్చే పిటిషనర్లు సంయమనం పాటించాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, సంబంధిత ప్రక్రియ పూర్తయ్యే వరకు కొంత సమయం వేచి ఉండాలని పేర్కొన్నారు. ఆవేశాలకు లోనై అనవసరమైన పరిణామాలకు కారణం కాకుండా అధికారులు, ప్రజలు పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో వసంత, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, హౌసింగ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయాధికారి కార్యాలయంలో కొత్త అధికారులు..






## బోర్డుపై మాత్రం పాత వివరాలు

**అధికారులు మారినా సమాచార బోర్డులో పాత పేర్లే**
**హసన్‌పర్తి మండలంలో ఐదు వ్యవసాయ క్లస్టర్లు**
**రైతులకు ఏఈఓల వివరాలు అందుబాటులో ఉండాల్సిన అవసరం**
**ఆర్టీఐ బోర్డులోనూ తాజా వివరాలు ప్రదర్శించాలి**
**సమాచార బోర్డులను సకాలంలో నవీకరించాలని రైతుల విజ్ఞప్తి**

**హసన్‌పర్తి, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్):**

హసన్‌పర్తి మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన ఆర్టీఐ, సమాచార బోర్డులో అధికారులు మారినప్పటికీ పాత అధికారుల వివరాలే కొనసాగుతున్నాయి. వ్యవసాయ శాఖ పరిధిలో ఏఈఓలు మారి కొత్తగా బాధ్యతలు చేపట్టినప్పటికీ కార్యాలయం ముందు ప్రజలకు కనిపించే బోర్డులో మాత్రం పాత పేర్లు, వివరాలు కొనసాగుతుండటం గమనార్హం. హసన్‌పర్తి మండల వ్యవసాయ శాఖ పరిధిలో హసన్‌పర్తి, నాగారం, జైగిరి, సిద్ధాపూర్, ముచ్చర్ల అనే ఐదు క్లస్టర్లు ఉన్నాయి. ప్రస్తుతం హసన్‌పర్తి క్లస్టర్‌లో ఏఈఓగా ఉడత సాయి విధులు నిర్వహిస్తూ అనంతసాగర్, హసన్‌పర్తి, ఎల్లాపూర్ గ్రామాలను పర్యవేక్షిస్తున్నారు. నాగారం క్లస్టర్‌లో ఏఈఓగా శైలజ పెగడపల్లి, పెంబర్తి, సుదనపల్లి, నాగారం గ్రామాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జైగిరి క్లస్టర్‌లో ఏఈఓగా బందెల సుమన్ మడిపల్లి, దేవన్నపేట్, లక్నవరం, జైగిరి గ్రామాలను పర్యవేక్షిస్తున్నారు. సిద్ధాపూర్ క్లస్టర్‌లో ఏఈఓగా బిందు బైరంపల్లి, అరవపల్లి, మల్లారెడ్డిపల్లి, వంగపాడు, సిద్ధాపూర్ గ్రామాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముచ్చర్ల క్లస్టర్‌లో ఏఈఓగా సానియా భీమారం, చింతగట్టు, ముచ్చర్ల గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆయా క్లస్టర్లలో విధులు నిర్వహిస్తున్న అధికారుల వివరాలకు అనుగుణంగా కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమాచార బోర్డు నవీకరించకపోవడం గమనార్హం. వ్యవసాయ శాఖకు సంబంధించిన పంటల నమోదు, విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంటల సమస్యలు, సాగు సలహాలు తదితర అంశాలపై రైతులు సంబంధిత ఏఈఓలను సంప్రదించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్లస్టర్ వారీగా ప్రస్తుత అధికారుల పేర్లు, గ్రామాల వివరాలు స్పష్టంగా బోర్డుపై అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)కు సంబంధించిన బోర్డులో పీఐఓ, మొదటి అప్పీల్ అధికారి తదితర వివరాలు కూడా తాజా సమాచారంతో ప్రదర్శించాల్సి ఉంటుంది. అధికారులు బదిలీ అయినా, కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించినా కార్యాలయాల్లోని సమాచార బోర్డులను సంబంధిత శాఖలు ఎప్పటికప్పుడు సవరించడం అవసరం. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల విధులు, అధికారుల బాధ్యతలు, సంప్రదించాల్సిన అధికారుల వివరాలు సులభంగా తెలిసేలా సమాచార బోర్డులను ఏర్పాటు చేస్తారు. అలాంటి బోర్డుల్లో పాత సమాచారం కొనసాగితే ప్రజలకు సరైన సమాచారం అందే విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హసన్‌పర్తి మండల వ్యవసాయాధికారి కార్యాలయం ముందు ఉన్న సమాచార, ఆర్టీఐ బోర్డులను సంబంధిత అధికారులు పరిశీలించి, ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారుల పేర్లు, హోదాలు, క్లస్టర్ల పరిధిలోని గ్రామాలు, పీఐఓ, మొదటి అప్పీల్ అధికారి తదితర వివరాలను తాజా సమాచారంతో నవీకరించాలని కోరుతున్నారు. అధికారులు మారిన ప్రతిసారీ కార్యాలయాల్లోని సమాచార బోర్డులను సకాలంలో సవరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, మండలంలోని ఐదు వ్యవసాయ క్లస్టర్లకు సంబంధించిన తాజా వివరాలను ప్రజలకు స్పష్టంగా అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

# ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం: సీపీ ఎన్. శ్వేత

**ఆటోలు, క్యాబ్‌లకు “అభయ-మై ట్యాక్సీ సేఫ్” యాప్.. తప్పనిసరిగా స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలి**




**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మహిళలు, ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ రూపొందించిన అభయ--మై ట్యాక్సీ సేఫ్ యాప్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ “ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం.. ప్రతి పౌరుడి బాధ్యత కూడా” అని అన్నారు. ఆటోలు, క్యాబ్‌లలో ప్రయాణించే మహిళలు, ఇతర ప్రయాణికుల భద్రతకు ఈ యాప్ ద్వారా మరింత భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి ఆటో, క్యాబ్ డ్రైవర్ తప్పనిసరిగా “అభయ--మై ట్యాక్సీ సేఫ్” స్టిక్కర్‌ను తమ వాహనంపై ఏర్పాటు చేసుకోవాలని సీపీ సూచించారు. వాహనంపై ఈ స్టిక్కర్ కనిపించగానే ప్రయాణికుల్లో భద్రతపై నమ్మకం కలుగుతుందని, రానున్న రోజుల్లో ప్రయాణికులు అభయ--మై ట్యాక్సీ సేఫ్ స్టిక్కర్ ఉన్న ట్యాక్సీ వాహనాల్లో ప్రయాణించేందుకు ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి ఆటో, క్యాబ్ యజమాని తమ వాహన వివరాలను అభయ--మై ట్యాక్సీ సేఫ్ యాప్‌లో నమోదు చేసుకుని, సమీప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి స్టిక్కర్లను పొంది తమ వాహనాలకు అంటించుకోవాలని సూచించారు. ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ముఖ్యంగా మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ ఎన్. శ్వేత సూచించారు. ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్యాక్సీ డ్రైవర్లకు యాప్ వినియోగం, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ట్యాక్సీ వాహనాల్లో ప్రయాణించే మహిళలు, ఇతర ప్రయాణికులు కూడా అభయ--మై ట్యాక్సీ సేఫ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాహనాలపై ఏర్పాటు చేసే స్టిక్కర్ల ద్వారా ప్రయాణికులకు యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలను వినియోగించుకునేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసు కళాబృందం నాటక ప్రదర్శన ద్వారా ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, ప్రయాణికుల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, ట్యాక్సీ డ్రైవర్లు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 15 ఏళ్ల వైభవ్‌ను స్టార్‌గా తీర్చిదిద్దుతున్న టీమిండియా.. మోర్కెల్ చెప్పిన మాస్టర్ ప్లాన్!

**వైభవ్‌ను సీనియర్లతో కలిసి నేర్చుకునేలా చేస్తున్న టీమిండియా**
**15 ఏళ్ల యువ ఓపెనర్‌కు మోర్కెల్ సూచనలు**
**గేమ్ టైమ్ లేకపోయినా నేర్చుకోవచ్చన్న కోచ్**
**సీనియర్ల ఆటతీరును గమనించాలని సూచన**
**ప్రతి ప్రాక్టీస్ తర్వాత ఏం నేర్చుకున్నావని ప్రశ్న**

టీమిండియాలోకి వచ్చిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని పెద్ద ఆటగాడిగా తీర్చిదిద్దేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. సీనియర్ ఆటగాళ్ల మధ్య ఉండటం, వాళ్లను గమనించడం, ప్రశ్నలు అడగడం ద్వారా 15 ఏళ్ల వైభవ్ ఎంతో నేర్చుకోగలడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. వెస్టిండీస్‌తో మంగళవారం ప్రారంభమయ్యే ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతను ఈ వ్యాఖ్యలు చేశారు. వైభవ్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా.. రాకపోయినా అతడి ఎదుగుదల ఆగదని మోర్కెల్ అన్నారు. మ్యాచ్ ఆడకపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్ ఆటగాళ్లతో గడపడం, వాళ్లు ప్రాక్టీస్‌కు ఎలా సిద్ధమవుతున్నారు? ఇన్నింగ్స్‌ను ఎలా ప్లాన్ చేస్తున్నారు? పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా స్పందిస్తున్నారు? అన్నది గమనించడం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. “ప్రాక్టీస్‌లో ఈ ఆటగాడు ఏం చేస్తున్నాడో చూడు. అతడు తొలి 15 బంతులను ఎలా ఎదుర్కొంటున్నాడు? పిచ్ నుంచి సహకారం లభిస్తే ఎలా ప్లాన్ చేస్తున్నాడు? అని యువ ఆటగాళ్లను ఆలోచించేలా చేస్తాను” అని మోర్కెల్ తెలిపాడు. ప్రతి ప్రాక్టీస్ సెషన్ తర్వాత వైభవ్ ఏం నేర్చుకున్నాడో అడుగుతానని చెప్పాడు. “నేను ఫాస్ట్ బౌలర్‌ను. బ్యాటింగ్ గురించి ఎక్కువగా చెప్పలేను. కానీ బస్సులో అతడిని ‘ఈ రోజు ఏం నేర్చుకున్నావు? ఆ ఆటగాడి బ్యాటింగ్‌లో ఏం గమనించావు?’ అని అడుగుతాను. ఇలా అడగడం వల్ల అతడు ఆలోచిస్తాడు. తర్వాత నెట్స్‌లోకి వచ్చినప్పుడు ఆ విషయాలను గమనించి తన ఆటకు తగ్గట్టుగా మార్చుకుంటాడు” అని వివరించాడు. ఇక భారత్–వెస్టిండీస్ టీ20 సిరీస్ తొలి మ్యాచ్ లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనుంది. ఆసియా క్రీడల నుంచి తిరిగొచ్చిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రయాణ అలసటను పరిశీలించిన తర్వాత తుది జట్టును ఎంపిక చేస్తామని మోర్కెల్ తెలిపాడు. గాయంతో కొంతకాలం దూరమైన మయాంక్ యాదవ్ తిరిగి జట్టులోకి రావడం కూడా భారత్‌కు కీలకమేనన్నారు. అతడి వేగం ప్రత్యేక ఆయుధమని చెప్పాడు. నెట్ బౌలర్‌గా మొదలై ఇప్పుడు భారత్ తరఫున ఆడే స్థాయికి చేరుకున్న ప్రిన్స్ యాదవ్ కష్టపడిన తీరును మోర్కెల్ ప్రశంసించాడు.

# 25 రోజులు గడిచినా అజయ్ ఆచూకీ లేదు

**పోలీసుల దర్యాప్తుపై బాధిత కుటుంబం ఆందోళన**

**కీసర, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

కుమారుడు కనిపించకుండా పోయి 25 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆచూకీ లభించకపోవడంతో గంధమల్ల అజయ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ కుమారుడి ఆచూకీ కోసం పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన సమాచారం లభించలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గంధమల్ల శంకర్ తన కుమారుడు గంధమల్ల అజయ్ కనిపించడం లేదని 2026 సెప్టెంబర్ 4న కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి 25 రోజులు గడుస్తున్నా అజయ్ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యుల ఆందోళన రోజురోజుకూ పెరుగుతోంది. తమ కుటుంబానికి 25 రోజులు 25 సంవత్సరాలుగా అనిపిస్తున్నాయని వారు కన్నీటితో చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినప్పటికీ, దర్యాప్తు నామమాత్రంగానే సాగుతోందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కేసు విషయంలో ఉన్నత స్థాయి పోలీసు అధికారులను ఆశ్రయించగా వారు స్పందించి కింది స్థాయి అధికారులకు దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం విచారణ తూతూమంత్రంగానే కొనసాగుతోందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. అజయ్ అదృశ్యానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ముఖ్యంగా సీసీటీవీ ఫుటేజీలు, ఫోన్ కాల్ వివరాలు, అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలు, అజయ్ చివరిగా ఎక్కడ కనిపించాడు, ఎవరెవరితో సంబంధాలు కలిగి ఉన్నాడు తదితర అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి అజయ్ ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, అజయ్ అదృశ్యమైన అనంతరం ఓ యువతి బాధిత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి "అజయ్ కోసం ఏమైంది?" అంటూ పదేపదే అడుగుతున్న విషయాన్ని కూడా కుటుంబ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే ఆ యువతి, ఆమె కుటుంబ సభ్యులను పోలీసులు కనీసం సమగ్రంగా విచారించలేదని వారు ఆరోపిస్తున్నారు. ఆ యువతి మరియు ఆమె కుటుంబ సభ్యుల వ్యవహారంపై తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని, వాటిని కూడా అన్ని కోణాల్లో పరిశీలించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అయితే ఎవరి ప్రమేయం ఉందనే విషయాన్ని పోలీసులు ఆధారాలతో నిర్ధారించాలని, తమ అనుమానాలను కూడా దర్యాప్తులో భాగంగా పరిగణనలోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అజయ్ ఆచూకీ కోసం బాధిత కుటుంబం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను కూడా ఆశ్రయించినట్లు తెలిపింది. తమ కుమారుడి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, రోజులు గడుస్తున్న కొద్దీ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని వారు పేర్కొన్నారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని దర్యాప్తును పర్యవేక్షించాలని, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో సమగ్ర విచారణ చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. 25 రోజులుగా ఎదురుచూస్తున్న తమ కుమారుడు అజయ్ ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించి క్షేమంగా తమ వద్దకు చేర్చాలని వారు పోలీసు అధికారులను కన్నీటితో వేడుకుంటున్నారు.




# బల్దియాలో ఆర్ఐ పోస్టింగులపై 'మూడు ఏళ్ల' నిబంధన ఎక్కడ?

**ఆర్ఐల స్థానచలనాల వెనుక కాసుల దందా ఆరోపణలా..?**
**ఉన్నతాధికారి తీరుపై ఉద్యోగుల్లో గుసగుసలు..**
**బల్దియా కమిషనర్ విచారణకు ఆదేశిస్తారా?**

**వరంగల్,5 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ బల్దియాలో ఆర్ఐల పోస్టింగులు, స్థానచలనాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకే స్థానంలో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని నిబంధనల ప్రకారం బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ, ముఖ్యంగా కొందరు ఆర్ఐల నుంచి రూ.2 లక్షల వరకు కాసులు తీసుకుని వారిని అదే స్థానాల్లో కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

**"కాసులు ఇచ్చాం.. తిరిగి ఇవ్వండి.. లేకపోతే ఇక్కడే ఉంచండి"**

బల్దియా వర్గాల్లో వినిపిస్తున్న మరో ఆరోపణ మరింత ఆసక్తికరంగా ఉంది. పోస్టింగుల విషయంలో డబ్బులు చెల్లించామని భావిస్తున్న కొందరు ఆర్ఐలు సంబంధిత ఉన్నతాధికారిని కలిసి "మా కాసులు తిరిగి ఇవ్వండి.. లేకపోతే మమ్మల్ని ఇదే స్థానంలో కొనసాగించండి" అంటూ వాగ్వాదానికి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే, బల్దియాలో పోస్టింగులు, స్థానచలనాలు ఏ ప్రాతిపదికన జరుగుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




**కేసులు ఉన్నవారికే కీలక పోస్టింగులా?**

ఇదే సమయంలో వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను ఆర్ఐలుగా నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా బల్దియాలో వినిపిస్తున్నాయి. ఏ సి బి రైడ్ లో దొరికిన వారికి, క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న లేదా గతంలో జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తులకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు ఎందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయో ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.ఒకవైపు నిబంధనల ప్రకారం స్థానచలనాలు చేపట్టాల్సిన అవసరం ఉండగా, మరోవైపు కొత్త పోస్టింగుల విషయంలో వివాదాస్పద నేపథ్యం ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రాజకీయ సిఫారసుల వెనుక అసలు కారణమేంటి?**

కొత్త పోస్టింగుల విషయంలో కొందరు తాజా మాజీ కార్పొరేటర్లు, రాజకీయ నాయకుల ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులకు ఫోన్లు చేయించేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం కూడా బల్దియాలో ఉంది. అయితే ప్రభుత్వ పరిపాలనలో పోస్టింగులు రాజకీయ సిఫారసుల ఆధారంగా కాకుండా నిబంధనలు, సీనియారిటీ, అర్హత, పరిపాలనా అవసరాల ఆధారంగా జరగాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**పదవీ విరమణకు ముందు అయినా పారదర్శక పాలన చూపిస్తారా?**

ప్రభుత్వ సంస్థలో సుదీర్ఘకాలం పనిచేసిన అధికారులు తమ పదవీకాలం చివరి దశలోనైనా నిబంధనలు, పారదర్శకత, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని బల్దియా వర్గాలు కోరుతున్నాయి.ప్రజల పన్నులతో నడిచే సంస్థలో పోస్టింగులు, బదిలీలు, బాధ్యతల కేటాయింపుల విషయంలో ఒక్క రూపాయి కూడా అక్రమంగా చేతులు మారకూడదన్నది ప్రజల ప్రధాన డిమాండ్.మరి మూడేళ్ల నిబంధనను బల్దియాలో ఎలా అమలు చేస్తున్నారు? ఎవరు కొనసాగాలి? ఎవరు బదిలీ కావాలి? కొత్త పోస్టింగులకు ఏ ప్రాతిపదిక? కాసులు తీసుకున్నారన్న ఆరోపణల్లో వాస్తవం ఎంత? క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వారికి కీలక బాధ్యతలు అప్పగించేందుకు జరుగుతున్న ప్రయత్నాల వెనుక కారణమేంటి? ఈ ప్రశ్నలకు బల్దియా ఉన్నతాధికారులు స్పష్టమైన సమాధానం ఇస్తారా? లేక ఆరోపణలపై మౌనం కొనసాగుతుందా? అనేది వేచి చూడాలి.

## విద్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నల్లాని శ్రీనివాస్ పదవీకాలం మరో ఏడాది పొడిగింపు

**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఖజూజు) ప్రిన్సిపాల్‌గా, విద్యా విభాగం విభాగాధిపతిగా కొనసాగుతున్న డాక్టర్ నల్లాని శ్రీనివాస్ పదవీకాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ నల్లాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యా విభాగంలో బోధన, అభ్యసనం, పరిశోధనతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన పదవీకాలంలో ఎం.ఎడ్‌లో నాలుగు, బి.ఎడ్‌లో ఎనిమిది సెమిస్టర్లను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మరో ఏడాది పాటు తనపై నమ్మకంతో పదవీకాలాన్ని పొడిగించిన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య కర్ణే ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంకు డాక్టర్ నల్లాని శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీకాలంలో సహకరించిన అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న కాలంలో విద్యా విభాగాన్ని మరింత ఉన్నత ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు, బోధనతో పాటు పరిశోధన, విద్యార్థుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని డాక్టర్ నల్లాని శ్రీనివాస్ పేర్కొన్నారు.



# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్**
**తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు**
**బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి**
**రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ వేళ పరిణామం**
**ఇంప్లీడ్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్):**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ.50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# ప్రజావాణిలో కొందరు అధికారుల స్వల్ప ఆలస్యం

**ఉదయం 10 గంటలకు కార్యక్రమం.. ఆలస్యంగా హాజరైన కొందరు అధికారులు**




**హసన్ పర్తి, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు ముందుగా ప్రకటించగా, కొందరు అధికారులు స్వల్ప ఆలస్యంతో కార్యక్రమానికి హాజరయ్యారు. తమ సమస్యలపై వినతులు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు సంబంధిత అధికారులను కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజావాణి ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కార్యక్రమానికి నిర్ణీత సమయానికి హాజరై ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరారు. కాగా, ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీకి 2, రెవెన్యూ శాఖకు 5, ఎంపీపీకి 1, ఆర్‌అండ్‌బీ శాఖకు 1 చొప్పున మొత్తం 9 వినతులు అందినట్లు ఎంపీడీవో సుమనా వాణి తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల ద్వారా వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

# బడిబాటలో పిల్లలు.. డ్రగ్స్‌కు దూరంగా యువత

**విద్యా ప్రేరణతో డ్రాప్‌అవుట్ విద్యార్థులకు వరంగల్ పోలీసుల అండ**






**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

పాఠశాల మానేసిన విద్యార్థులను తిరిగి బడిబాట పట్టించి, వారిని డ్రగ్స్, ధూమపానం, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో విద్యా ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు నిర్వహించిన విశ్లేషణలో గుర్తించిన నేపథ్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలిదశలో వరంగల్ సబ్ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువు మానేసిన 42 మంది విద్యార్థులను గుర్తించారు. వారిలో 22 మంది విద్యార్థులను కౌన్సెలింగ్, తల్లిదండ్రులతో చర్చలు, అవసరమైన సహాయ సహకారాల ద్వారా విజయవంతంగా తిరిగి పాఠశాలల్లో చేర్పించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ తదితర విద్యా సామగ్రిని అందించి వారు చదువును కొనసాగించేలా పోలీసుల తరఫున ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించడంతో కార్యక్రమం ముగియదని, తిరిగి బడిలో చేరిన విద్యార్థుల పాఠశాల హాజరు, విద్యాభ్యాసం, ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సందర్భాల్లో కౌన్సెలింగ్, ప్రోత్సాహం, సహాయ సహకారాలను అందిస్తామని వరంగల్ పోలీసులు తెలిపారు. ప్రతి పిల్లవాడిని బడిలో ఉంచడం.. డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం.. వారి భవిష్యత్తును కాపాడడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా నిరంతరం వారితో మాట్లాడి మార్గనిర్దేశం చేయాలని పోలీసులు సూచించారు.

# సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

**హైదరాబాద్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినీ నటి సురేఖావాణిని కించపరిచేలా సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టు తీవ్ర వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కైలాశ్ సజ్జన్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'డిగ్‌టీవీ తెలుగు (డిగ్‌టీవీ ప్యారడీ)' పేరుతో ఉన్న ఓ ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్ రెడ్డి, నటి సురేఖావాణి చిత్రాలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన వ్యాఖ్యలతో పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్ట్ ఉద్దేశపూర్వకంగా ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు, ప్రభుత్వంపై ప్రజల్లో ద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఉందని ఆరోపించారు. అలాగే ఒక మహిళా నటి గౌరవానికి భంగం కలిగించేలా ఈ చర్యకు పాల్పడ్డారని కైలాశ్ సజ్జన్ తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. సీఎంను అవమానించడంతో పాటు, నటిని కించపరిచేలా ఉన్న ఈ పోస్టుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు స్వీకరించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు సంబంధిత ఎక్స్ ఖాతా నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించి, నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# ఐసీఐసీఐ బ్యాంకులో 150 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా

**హన్మకొండ, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐసీఐసీఐ బ్యాంకులో 150 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఐటీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపిక ప్రక్రియ అక్టోబర్ 8న ఉదయం 10.30 గంటలకు హనుమకొండలోని డీఆర్‌డీఏ కార్యాలయం, ఎస్1, ఐడీఓసీ, సుబేదారి వద్ద జరుగుతుందని పేర్కొన్నారు. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు 2022 నుంచి 2026 వరకు డిగ్రీ పూర్తి చేసిన, 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.26,000 వరకు వేతనం, సంవత్సరానికి సుమారు రూ.3.12 లక్షల ప్యాకేజీ లభించనుందని, తెలంగాణలోని వివిధ జిల్లాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు 15 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ముందుగా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహించి, అనంతరం ఎన్‌ఐఐటీ ప్యానెల్ ద్వారా ఇంటర్వ్యూ, చివరగా ఐసీఐసీఐ బ్యాంకు అధికారుల ఫైనల్ ఇంటర్వ్యూ ఉంటుందని అధికారులు వెల్లడించారు. అర్హత కలిగిన హనుమకొండ జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత తమ రెజ్యూమ్‌తో అక్టోబర్ 8న ఉదయం 10.30 గంటలకు డీఆర్‌డీఏ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8801525396 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ ఉద్యోగ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కోరారు.



తేది. 05.10.2026.

ఉద్యోగ మేళా - పత్రిక ప్రకటన

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఏ) – ఈ.జి.యం.యం, హనుమకొండ జిల్లా

డి.ఆర్.డి.ఏ- ఈ.జి.యం.యం. (ఎంప్లాయిమెంట్ జనరేషన్ & మార్కెటింగ్ మిషన్) హనుమకొండ జిల్లా ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకుల నుండి "ICICI Bank" ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలకై NIIT (National Institute of Information Technology) ఆధ్వర్యంలో తేది. 08/10/2026 (గురువారం) ఉ. 10:30 గం, లకు DRDA కార్యాలయం, S1, IDOC, సుబేదారి, హనుమకొండ యందు online పరీక్ష మరియు ముఖా-ముఖీ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయబడును.

కనీస అర్హతలు & కంపెనీ వివరాలు:-

| | | |
|---|---|---|
| సంస్థ పేరు | : | ICICI Bank (NIIT ఆధ్వర్యంలో) |
| హోదా | : | Relationship Manager |
| విద్యార్హతలు | : | ఏదైనా డిగ్రీ (Passed out 2022 to 2026) |
| లింగం | : | స్త్రీ/పు |
| వయస్సు | : | 25 సం, రాల లోపు |
| జీతం | : | ప్రారంభ వేతనం నెలకు రూ. 26,000/- (సంవత్సరానికి రూ.3.12 లక్షలు) |
| ఖాళీలు | : | 150 |
| ఎంపిక అనంతరం శిక్షణ | : | న్యూ ఢిల్లీ లో 15 రోజులు ఉచిత శిక్షణ తో పాటు వసతి |
| పని చేయు ప్రదేశం | : | తెలంగాణా జిల్లాలలో |

ఎంపిక విధానం:-

- Online Aptitude Test (Through Mobile Phone)
- Interview by NIIT (National Institute of Information Technology) Panel and Final Interview by ICICI Bank officials.

కావున అర్హత మరియు ఆసక్తి గల హనుమకొండ జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు తమ యొక్క బయోడేటా లేదా Resume తో పాటు, విద్యార్హత ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలతో తేది. 08/10/2026 (గురువారం) ఉ. 10:30 గం, లకు DRDA కార్యాలయం, రెండవ అంతస్తు S1, IDOC, కలెక్టరేట్, సుబేదారి, హనుమకొండ నందు జరుగు ఉద్యోగ మేళా కు హాజరు కావలసిందిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (DRDA), హనుమకొండ శ్రీ. మేన శ్రీను గారు కోరుతున్నారు. మరిన్నివివరాల కొరకు శ్రీ. కిర్తి వేణు, డైరెక్ట్ ప్లేస్మెంట్ ట్రైనర్, మొబైల్ నం. 8801525396 ను సంప్రదించగలరు.

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి
డి.ఆర్.డి.ఏ - హనుమకొండ జిల్లా

దిని ప్రతి జిల్లా పౌర సంబంధాల అధికారి, హనుమకొండ గారికి సమర్పిస్తూ అన్ని ప్రముఖ పత్రికలలో ప్రచురించుటకు కోరనైనది.

# హనుమకొండలో 270 ప్రైవేట్ ఉద్యోగాలకు జాబ్ మేళా

### అక్టోబర్ 7న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు



తెలంగాణ ప్రభుత్వము
ఉపాధి కల్పన మరియు శిక్షణా శాఖ

Dated 05.10.2026
హనుమకొండ

పేపర్ ప్రకటన (Press Note for Private Jobs

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, హనుమకొండ „ ఈ దిగువ తెలిపిన పేపర్ ప్రకటనను అన్ని ప్రముఖ దిన పత్రికలలో ప్రచురించ వలసినదిగా కోరనైనది.

హనుమకొండ జిల్లా మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా లోని నిరుద్యోగ **యువతీ యువకులకు** తెలియజేయునది ఏమనగా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయము హనుమకొండ జిల్లా వారి ఆధ్వర్యంలో తేది: **-07-10-2026** నాడు జాబ్ మేళా (Private Jobs) నిర్వహించబడును ఈ దిగువ తెలుపబడిన కంపెనీలలో placement కొరకు ఇంటర్వ్యూలు జరుగుతాయి.

కంపెనీ పేరు విద్యార్హతలుమరియు వివరములు

కంపెనీ పేరు : మేడిప్లస్

| పోస్టుల పేరు : | పోస్టుల సంఖ్య | నెలవారీ వేతనం |
|---|---|---|
| జూనియర్ అసిస్టెంట్ | 100 | 16,000 |
| ఫార్మసీ -aid | 50 | 17,000 /- to 25,000 |
| ఫార్మసిస్ట్ | 40 | 18,500/- to 25,000 |
| csa | 50 | 16,000/-17,000 |
| ఆడిట్ అసిస్టెంట్ | 30 | 16,000/- Daily allowances |

ఉద్యోగ ప్రదేశం : హనుమకొండ / హైదరాబాద్

అర్హత : డి ఫార్మసీ /యం ఫార్మసీ /బి ఫార్మసీ/ 10వ తరగతి /ఇంటర్/ ఏదయినా degree

వయస్సు : 19-32

**యువతీ యువకులుకు** బయోడాటా లేదా రెస్యూములతో పాటు, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపిలతో ఉదయం **10.30 గం.లకు తేదీ 07-10-2026** రోజున జరుగు జాబ్ మేళాకు హాజరు కావలసిందిగా కోరుతున్నారు వివరాల కొరకు, Mobile No 7893394393 సంప్రదించగలరు.

VENUUE: Dist Employment Office,(MCC) Govt ITI (Boys) Camps Mulugu Road Warangal.

భవదీయులు,
District Employment Officer
District Employment Exchange
Hanumakonda

**హన్మకొండ, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 7న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి శ్యామల తెలిపారు. హనుమకొండ జిల్లా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో మెడిప్లస్ సంస్థలో మొత్తం 270 ఉద్యోగ ఖాళీలకు అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన ఉదయం 10.30 గంటలకు హనుమకొండలోని జిల్లా ఉపాధి కార్యాలయం (ఎంసీసీ), ప్రభుత్వ ఐటీఐ (బాయ్స్) క్యాంపస్, ములుగు రోడ్, వరంగల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 100, ఫార్మసీ ఎయిడ్ పోస్టులు 50, ఫార్మసిస్ట్ పోస్టులు 40, సీఎస్‌ఏ పోస్టులు 50, ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు 30 చొప్పున ఖాళీలు ఉన్నాయని వివరించారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.16 వేల వేతనం, ఫార్మసీ ఎయిడ్‌కు రూ.17 వేల నుంచి రూ.25 వేల వరకు, ఫార్మసిస్ట్‌కు రూ.18,500 నుంచి రూ.25 వేల వరకు, సీఎస్‌ఏకు రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకు వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఆడిట్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.16 వేల వేతనంతో పాటు రోజువారీ అలవెన్సులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ ప్రదేశాలు హనుమకొండ, హైదరాబాద్‌గా ఉంటాయని తెలిపారు. పోస్టుల వారీగా డీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీ.ఫార్మసీ, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని, వయస్సు 19 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఎలాంటి ముందస్తు రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, రెజ్యూమ్, ఇతర అవసరమైన పత్రాలతో అక్టోబర్ 7న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా వేదికకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సూచించింది. మరిన్ని వివరాల కోసం 7893394393 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# కిట్స్ వరంగల్‌లో ఘనంగా కెయూ ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్స్





**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్స్ 2026-27 (ఫేజ్-1) కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని క్రీడా మైదానాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కిట్స్ వరంగల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక సమతుల్యత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. క్రీడలు జాతీయ సమగ్రత, సోదరభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వైఫల్యం విజయానికి సోపానమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి జీవితంలో ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ టి. శాస్త్రి మాట్లాడుతూ.. విద్యలో క్రీడలు, ఆటలు శారీరక దృఢత్వంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో క్రీడలపై పెరుగుతున్న ఆసక్తికి ఈ టోర్నమెంట్ నిదర్శనమన్నారు. క్రీడలు, ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడంలో కాకతీయ యూనివర్సిటీ, కిట్స్ వరంగల్ యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితాల సతీష్ కుమార్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. యువత శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడంలో శారీరక విద్య కీలకమని అన్నారు. కిట్స్ వరంగల్‌లో అందుబాటులో ఉన్న ఇండోర్ స్టేడియం, యోగా సదుపాయాలతో కూడిన వ్యాయామశాల, ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, టెన్నిస్ తదితర క్రీడా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న క్రీడా మైదానాలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. క్రీడలు ఒత్తిడిని అధిగమించడంతో పాటు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి 47 కళాశాలలకు చెందిన 973 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, ఖో-ఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ వంటి ఆరు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 2025-26 విద్యా సంవత్సరంలో కిట్స్ వరంగల్ నుంచి సౌత్ జోన్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులుగా బి. విష్ణు (ఖో-ఖో), ఎన్. గౌతమ్, పి. లిఖిత్ (ఫుట్‌బాల్), మయూర్ రాజ్ (బాస్కెట్‌బాల్), ఎం. దిలీప్ రెడ్డి (ఆల్ ఇండియా సాఫ్ట్‌బాల్) ప్రాతినిధ్యం వహించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ యం. శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు, కోచ్‌లు, మేనేజర్లు, సాంకేతిక అధికారులు, డీన్లు, వివిధ విభాగాల అధిపతులు, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్వో డాక్టర్ డి. ప్రభాకర చారి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు వెంకటస్వామి, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొని టోర్నమెంట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# నేరం సమాజాన్ని తొలిచే పురుగు.. అప్రమత్తతతోనే అడ్డుకట్ట

**హైద్రబాద్, 5 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)**



నేరం సమాజాన్ని లోపల నుంచి తొలిచే పురుగులా మారిందని, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ నేరాలు కూడా కొత్త రూపాల్లో విస్తరిస్తున్నాయని మన తెలంగాణ సాక్షి హైదరాబాద్ నగర నేర వార్తా ప్రతినిధి, టీజేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుంగ చాందిని పేర్కొన్నారు. ప్రస్తుతం పత్రికలు, టెలివిజన్, సామాజిక మాధ్యమాలు తెరిచినా నేరాలకు సంబంధించిన వార్తలే ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. ఒకప్పుడు మనిషి అవసరాల కోసం మొదలైన దొంగతనాలు నేడు ఆశ, దురాశ, పగ, ప్రతీకారాల రూపంలో తీవ్రమైన నేరాలకు దారితీస్తున్నాయని తెలిపారు. చట్టం దృష్టిలో తప్పుగా పరిగణించే ప్రతి చర్య నేరమేనని, ఇతరులకు హాని కలిగించడం, మోసం చేయడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలు నేరాల పరిధిలోకి వస్తాయని వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, ఆర్థిక నేరాలు, యువతను లక్ష్యంగా చేసుకున్న నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతా నిలిపివేయబడిందని, లాటరీ వచ్చిందని, ఇంటి నుంచే ఉద్యోగం ఇప్పిస్తామని చెబుతూ ప్రజలకు సందేశాలు, అనుమానాస్పద అనుసంధానాలను పంపి వారి ఖాతాల్లోని డబ్బును దోచుకుంటున్నారని హెచ్చరించారు. తెలియని అనుసంధానాలను తెరవడం, రహస్య సంకేత సంఖ్యలు, బ్యాంకు పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను ఇతరులకు చెప్పడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మహిళలపై జరుగుతున్న నేరాల్లో వేధింపులు, ఈవ్‌టీజింగ్, వరకట్న వేధింపులు, కుటుంబ హింస వంటి ఘటనలు ఉన్నాయని, చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ అనేక ఘటనలు బయటకు రావడం లేదన్నారు. అదే విధంగా ఆర్థిక నేరాల్లో కార్యాలయాల్లో నగదు దుర్వినియోగం, నకిలీ పత్రాల తయారీ, భూ కబ్జాలు వంటి నేరాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన కొందరు చిన్నచిన్న దొంగతనాలకు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ అవకాశాల కొరత, డబ్బుపై విపరీతమైన వ్యామోహం, నైతిక విలువలు తగ్గిపోవడం, చట్టం పట్ల భయం లేకపోవడం, సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావం వంటి అంశాలు నేరాలకు కారణాలుగా మారుతున్నాయని బుంగ చాందిని అభిప్రాయపడ్డారు. నేరాలను అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా సామాజిక బాధ్యతతో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు వివరాలు, రహస్య సంకేత సంఖ్యలు, ధృవీకరణ సంకేతాలను ఎవరికీ చెప్పకూడదని, తెలియని అనుసంధానాలను తెరవకూడదని సూచించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112కు, సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. పిల్లలకు చిన్న వయస్సు నుంచే మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించాలని, సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో మాట్లాడకూడదని తల్లిదండ్రులు వారికి తెలియజేయాలని సూచించారు. తమ చుట్టుపక్కల ఏదైనా తప్పు లేదా అనుమానాస్పద చర్య జరుగుతున్నట్లు గమనిస్తే చూసీచూడనట్లు ఉండకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. నేరాన్ని పెంచింది సమాజమే.. దాన్ని తగ్గించాల్సింది కూడా సమాజమే. కష్టపడి సంపాదించిన రూపాయిలో ఉన్న తృప్తి, మోసం చేసి సంపాదించిన లక్షల్లో కూడా ఉండదు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినట్లే మన ఆలోచనా విధానం కూడా పెరగాలి. అయితే మానవత్వాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదు అని బుంగ చాందిని పేర్కొన్నారు.

# బార్ కౌన్సిల్ ఎన్రోల్మెంట్‌లో ఇదేం విధానం?

### ఆదివారం, సోమవారం మాత్రమే స్లాట్లు.. రోజుకు 200కే పరిమితం
### అర్హత ఉన్నా స్లాట్ దొరకదా? సర్వర్ స్పీడే భవిష్యత్తును నిర్ణయించాలా?

**హైద్రబాద్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ బార్ కౌన్సిల్‌లో అమలు చేస్తున్న నూతన ఆన్‌లైన్ ఎన్రోల్మెంట్ విధానంపై లా విద్యార్థులు, న్యాయవాదుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. లా కోర్సును విజయవంతంగా పూర్తి చేసి ఎన్రోల్మెంట్‌కు అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి సమాన అవకాశం కల్పించాల్సి ఉండగా.. పరిమిత స్లాట్లు, నిర్దిష్ట సమయం, ఆన్‌లైన్ బుకింగ్ విధానం కారణంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం, సోమవారం మాత్రమే ఎన్రోల్మెంట్ స్లాట్లు అందుబాటులో ఉంచడం, రోజుకు కేవలం 200 స్లాట్లకే పరిమితం చేయడం, సాయంత్రం 5 గంటలకు ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభించడం పట్ల విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎన్రోల్మెంట్ కోసం పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎదురుచూస్తున్న సమయంలో వారానికి కేవలం రెండు రోజులు, రోజుకు 200 స్లాట్లు మాత్రమే కేటాయించడం వల్ల అవకాశం పొందడం కష్టంగా మారుతోందని వారు చెబుతున్నారు. సాయంత్రం 5 గంటలకు ఒకేసారి పెద్ద సంఖ్యలో విద్యార్థులు స్లాట్ కోసం ప్రయత్నించడంతో వెబ్‌సైట్‌పై అధిక ట్రాఫిక్ ఏర్పడి సర్వర్ నెమ్మదించడం, స్పందించకపోవడం లేదా స్లాట్లు క్షణాల్లో పూర్తవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఒకే సమయంలో లా కోర్సు పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరికి స్లాట్ లభించి, మరొకరికి సర్వర్ సమస్య కారణంగా స్లాట్ లభించకపోతే అది సమాన అవకాశాల విధానమా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్రోల్మెంట్‌లో విద్యార్థి విద్యార్హత, నిబంధనల ప్రకారం ఉన్న అర్హత ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండగా.. ప్రస్తుతం ఎవరి ఇంటర్నెట్ వేగంగా ఉంది, ఎవరు ముందుగా బుకింగ్ చేశారు, ఎవరి సిస్టమ్ వేగంగా స్పందించింది అనే అంశాలు కీలకంగా మారుతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్రోల్మెంట్ మా అర్హత ఆధారంగా జరగాలి.. సర్వర్ స్పీడ్ ఆధారంగా కాదు అని వారు స్పష్టం చేస్తున్నారు. రోజుకు 200 స్లాట్ల పరిమితిని ఏ ప్రాతిపదికన నిర్ణయించారు, ఎన్రోల్మెంట్ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల సంఖ్య ఎంత, సర్వర్ సామర్థ్యం ఎంత, స్లాట్ దొరకని విద్యార్థులకు ప్రత్యామ్నాయ అవకాశం ఏమిటి అనే అంశాలపై బార్ కౌన్సిల్ స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్రోల్మెంట్ ప్రక్రియ ఎలా కొనసాగుతోంది, అక్కడ కూడా వారానికి రెండు రోజులు, రోజుకు పరిమిత స్లాట్ల విధానం అమలులో ఉందా అనే విషయాలను కూడా తెలంగాణ బార్ కౌన్సిల్ వెల్లడించాలని కోరుతున్నారు. ఒకే దేశంలో న్యాయ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు ఎన్రోల్మెంట్ విషయంలో రాష్ట్రాలవారీగా విధానాలు ఎందుకు భిన్నంగా ఉండాలనే ప్రశ్నను కూడా వారు లేవనెత్తుతున్నారు. ఎన్రోల్మెంట్ అనేది లా విద్యార్థి న్యాయవృత్తిలోకి ప్రవేశించే అత్యంత కీలకమైన దశ కావడంతో సర్వర్ సమస్యలు, వెబ్‌సైట్ ట్రాఫిక్, పరిమిత స్లాట్లు లేదా బుకింగ్ సమయంలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా అర్హత ఉన్న విద్యార్థి నష్టపోకూడదని వారు స్పష్టం చేస్తున్నారు. స్లాట్ కోసం పోటీ పెట్టడం కాదు.. అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఎన్రోల్మెంట్ అవకాశం కల్పించాలని లా విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత ఆన్‌లైన్ ఎన్రోల్మెంట్ విధానాన్ని బార్ కౌన్సిల్ తక్షణమే సమీక్షించి, ఆదివారం, సోమవారం మాత్రమే స్లాట్లు కేటాయించే విధానాన్ని, రోజుకు 200 స్లాట్ల పరిమితిని పునఃపరిశీలించి, అర్హులైన ప్రతి విద్యార్థికి సమాన అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎన్రోల్మెంట్ అర్హత ఆధారంగా జరగాలి.. స్లాట్ దొరికిందా లేదా అన్నదానిపై కాదు అని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ భారీ పాదయాత్ర






**ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలకు పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**హన్మకొండ, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ కోసం ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ పాదయాత్ర నిర్వహించారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హనుమకొండ అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రకు ముందు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణకు సంబంధించిన నినాదాలతో పాదయాత్రను ప్రారంభించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రధాన రహదారుల మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగిన పాదయాత్రలో కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటు ప్రజల హక్కుకు ప్రతీక అని అన్నారు. ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ఆయన, జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అరెస్టు చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. పాదయాత్ర సందర్భంగా నాయకులు “ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.. ఓటు హక్కును పరిరక్షించాలి” అంటూ నినాదాలు చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి దుద్దిళ్ల శ్రీనుబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి రవళి రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, డివిజన్, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, చైర్మన్లు, డివిజన్ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీకేఎం కళాశాల వివాదం.. కమిటీ నివేదిక ఎక్కడ?

**లైంగిక వేధింపుల ఆరోపణలపై పూజారి సతీష్ కుమార్‌పై చర్యలు ఏవి?**
**కలెక్టర్‌ను కలిసిన విద్యార్థి సంఘాలు**
**కమిటీ నివేదికను బహిర్గతం చేయాలి..**
**గత 15 ఏళ్ల ఆడిట్‌పై కూడా సమగ్ర విచారణ జరపాలి**



**వరంగల్, 5 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని చరిత్ర కలిగిన సీకేఎం డిగ్రీ కళాశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ వచ్చిన ఆరోపణలు, వాటిపై జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ విచారణ, అనంతరం తీసుకున్న చర్యలపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థినులు కలెక్టర్‌ను కలిసి తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతిపత్రం సమర్పించగా, దానిపై జిల్లా కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కళాశాలకు వెళ్లి విద్యార్థినులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించినట్లు విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. అయితే కమిటీ విచారణ పూర్తయినప్పటికీ నివేదికలో ఏమి తేలింది? దాని ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత లేకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోందని వారు అంటున్నారు.

**కమిటీ నివేదికను బయటపెట్టాలి**

విద్యార్థినులు చేసిన ఫిర్యాదులపై విచారణకు ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయాన్ని అధికారిక విచారణ ద్వారా తేల్చాలని, నివేదిక ఆధారంగా నిష్పక్షపాత చర్యలు తీసుకోవాలని కోరాయి. పూజారి సతీష్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, విచారణ పూర్తయ్యే వరకు అవసరమైన పరిపాలనా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆరోపణలు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**‘నేనే రాజు.. నేనే మంత్రి’ అంటూ భయపెడుతున్నారనే ఆరోపణలు**

కళాశాలలో తనకు రాజకీయంగా పలుకుబడి ఉందని, మాజీ మంత్రితో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ కొందరిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా విద్యార్థి సంఘాలు చేశాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉందని వారు పేర్కొన్నారు. అలాగే బదిలీ ఉత్తర్వుల ద్వారా కళాశాలకు వచ్చిన వ్యక్తి ఇక్కడే కొనసాగుతున్నారనే అంశంపైనా స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. బదిలీ ఉత్తర్వులు, విధుల కేటాయింపు, సర్వీస్ రికార్డులు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు.

**విద్యార్థినులపై ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు**

విద్యార్థినులు తమ వినతిపత్రంలో వీడియో కాల్స్, ఆడియో కాల్స్ ద్వారా ఇబ్బందులకు గురిచేశారని, బయటకు రావాలని ఒత్తిడి చేశారని, తన మాట వినకపోతే మార్కులు తగ్గిస్తానని, ఎన్‌సీసీలో కూడా తన మాట వినకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించినట్లు ఆరోపణలు చేసినట్టు విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. అయితే ఇవన్నీ విద్యార్థినులు చేసిన ఆరోపణలు మాత్రమేనని, వాటిపై అధికారిక విచారణ ద్వారా వాస్తవాలు తేలాల్సి ఉందని వారు స్పష్టం చేశారు.

**సిబ్బందిపై ఒత్తిడి ఉందా?**

కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది కూడా ఒత్తిడికి లోనై స్వేచ్ఛగా వాస్తవాలను చెప్పలేని పరిస్థితి ఉందా అనే అనుమానాలను విద్యార్థి సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. అందువల్ల కమిటీ మరోసారి విద్యార్థినులు, ప్రస్తుత సిబ్బంది, మాజీ సిబ్బందితో స్వతంత్రంగా మాట్లాడి వాంగ్మూలాలు తీసుకోవాలని కోరుతున్నాయి.

**15 ఏళ్ల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ చేయాలి**

విద్యార్థి సంఘాలు మరో కీలక డిమాండ్‌ను కూడా తెరపైకి తెచ్చాయి. గత 15 సంవత్సరాలుగా కళాశాలలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, అకౌంట్స్, ఫీజుల వసూళ్లు, కళాశాల ఖాతాల్లో జమ అయిన మొత్తాలు, ఖర్చులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు తదితర అంశాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశాయి. కళాశాల ప్రభుత్వ పరిధిలోకి రాకముందు చేసినట్లు చెబుతున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించిన మొత్తాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి? వాటిని ఎవరు నిర్వహించారు? వాటిపై వచ్చిన వడ్డీ, అసలు మొత్తం వివరాలు ఏమిటి? అనే అంశాలను కూడా ఆడిట్ ద్వారా స్పష్టం చేయాలని కోరారు. ఫీజుల రూపంలో విద్యార్థుల నుంచి ఎంత వసూలు చేస్తున్నారు? అందులో ఎంత మొత్తాన్ని కళాశాల ఖాతాల్లో జమ చేస్తున్నారు? ఎంత ఖర్చు చేస్తున్నారు? అనే పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

**రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తాం**

కళాశాలలో విద్యార్థినుల భద్రత, వారి విద్యా భవిష్యత్తు తమకు అత్యంత ముఖ్యమని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. అధికారులు తక్షణమే స్పందించకపోతే సీకేఎం కళాశాల ఎదుట, అవసరమైతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించాయి.

**రెండు మూడు రోజుల్లో తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించాయి.**

విద్యార్థినులు చేసిన ఆరోపణలు, కళాశాలపై వచ్చిన ఆర్థిక ఆరోపణలు వేర్వేరు అంశాలుగా పరిగణించి, రెండింటిపైనా స్వతంత్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా ఇప్పటికే కమిటీ విచారణ జరిపిన నేపథ్యంలో ఆ కమిటీ నివేదిక ఏమైంది? నివేదికలో ఏం తేలింది? దానిపై అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థినుల భద్రత, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ, కమిటీ నివేదిక బహిర్గతం, 15 ఏళ్ల ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర ఆడిట్ --- ఈ నాలుగు అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సి కె యం కళాశాలలో జరిగిన, జరుగుతున్న “పలు అక్రమాలపై” ప్రత్యేక వార్తలు అతి త్వరలో....

## రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ

**ఫిజియోథెరపీ సెంటర్ పునఃప్రారంభానికి రూ.2 లక్షలు డిమాండ్..**
**రూ.లక్ష స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ**




**హైద్రాబాద్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ డి.డి. స్వర్ణకుమారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఓ ప్రైవేట్ ఫిజియోథెరపీ సెంటర్‌ను తిరిగి ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ.2 లక్షలు లంచంగా డిమాండ్ చేసి, అందులో మొదటి విడతగా రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. ఫిజియోథెరపీ సెంటర్ పునఃప్రారంభానికి సంబంధించి అనుమతుల కోసం బాధితుడు డీఎంహెచ్ఓను సంప్రదించాడు. ఈ వ్యవహారంలో రూ.2 లక్షలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. ఈ క్రమంలో రూ.లక్ష నగదును స్వీకరిస్తుండగా అధికారులు డీఎంహెచ్ఓ స్వర్ణకుమారిని పట్టుకున్నట్లు తెలిసింది. ఈ లంచం వ్యవహారంలో డీఎంహెచ్ఓకు సహాయకుడిగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్‌తో పాటు ఓ ప్రైవేట్ డ్రైవర్ పాత్రపై కూడా ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. లంచం మొత్తాన్ని స్వీకరించిన అనంతరం ఈ విషయాన్ని శ్రీనివాస్ డీఎంహెచ్ఓకు ఫోన్ ద్వారా తెలియజేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా కొనసాగుతున్నారు. ఆమెను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. లంచం డిమాండ్, స్వీకరణకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్న అధికారులు.. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అధికారి లంచం కేసులో ఏసీబీకి పట్టుబడటం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## శివరామపురంలో మొరం మట్టి తరలింపుపై సమగ్ర విచారణ జరపాలి

**ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 196 నుంచి సుమారు 30 ట్రిప్పుల మట్టి తరలింపుపై ఆరోపణలు**

**రాయపర్తి, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం శివరామపురం గ్రామం (మొరిపిరాల ఎక్స్ రోడ్) పరిధిలో గ్రామ అభివృద్ధి, బతుకమ్మ కుంట అభివృద్ధి కోసం మొరం మట్టి వినియోగానికి సంబంధించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి కోసం మొరం మట్టి అవసరమని గ్రామ సర్పంచ్ శీల హేమలత రెడ్డి తరఫున ఆమె భర్త శీల రత్నాకర్ రెడ్డి ఎమ్మార్వోను కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గ్రామ అభివృద్ధి అవసరాల కోసం మొరం మట్టి తరలించేందుకు సంబంధిత అధికారులు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఆ అనుమతిని ఆధారంగా చేసుకుని ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే నంబర్ 196 నుంచి సుమారు 30 ట్రిప్పుల మొరం మట్టిని తరలించినట్లు, అందులో మట్టిని గ్రామ అభివృద్ధి పనులకు కాకుండా కుందూరు గోపాల్ రెడ్డికి చెందిన ప్రైవేట్ భూమికి తరలించినట్లు గ్రామంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా కాదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు అధికారిక రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించాల్సి ఉంది. ప్రభుత్వ అనుమతి ఏ ప్రయోజనం కోసం ఇచ్చారు, ఎంత పరిమాణంలో మొరం మట్టి తరలించేందుకు అనుమతి ఇచ్చారు, వాస్తవంగా ఎంత మట్టి తరలించారు, తరలించిన మట్టిని ఎక్కడ వినియోగించారు, గ్రామ అభివృద్ధి, బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు ఉపయోగించారా లేదా ప్రైవేట్ భూమికి తరలించారా అనే అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముఖ్యంగా సర్వే నంబర్ 196లోని ప్రభుత్వ భూమిని అధికారులు ప్రత్యక్షంగా తనిఖీ చేసి, మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు అనుమతి పత్రం, దాని షరతులు, అనుమతించిన పరిమాణం, తరలించిన వాహనాల వివరాలు, మట్టి వినియోగించిన ప్రదేశం తదితర అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, గ్రామ వనరులు ప్రజల ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని, వాటి వినియోగంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పేదలు, దళితులు, మాదిగల భూములు మరియు హక్కులకు సంబంధించిన విషయాల్లో ఎలాంటి అక్రమాలు జరిగినా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరుతున్నారు. సర్వే నంబర్ 196పై అధికారిక తనిఖీ నిర్వహించి, మొరం మట్టి తరలింపునకు ఇచ్చిన అనుమతి ప్రతిని, అందులోని నిబంధనలు, షరతులను ప్రజలకు స్పష్టం చేయడంతో పాటు అనుమతించిన పరిమాణం మరియు వాస్తవంగా తరలించిన పరిమాణాన్ని అధికారులు లెక్కించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మట్టి గ్రామ అభివృద్ధి కోసం వినియోగించబడిందా లేదా ప్రైవేట్ భూమికి తరలించబడిందా అనే విషయాన్ని విచారణ ద్వారా నిర్ధారించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూమి, గ్రామ వనరులు ప్రజల ఆస్తులని, వాటి వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిపై తీవ్ర ఆరోపణలు






**విద్యార్థినులు, మహిళా ఉద్యోగులపై అనుచిత ప్రవర్తన ఆరోపణలు.. సమగ్ర విచారణకు డిమాండ్**

**వరంగల్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని ఓ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఓ అధ్యాపకుడిపై పలు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధ్యాపకుడు కళాశాలలో ఎన్‌సీసీ అధికారిగా కూడా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. విద్యార్థులకు క్రమం తప్పకుండా పాఠాలు బోధించకుండా, కళాశాలలో తానే కీలక అధికారి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్‌గా తరగతులు నిర్వహిస్తున్న గెస్ట్ లెక్చరర్లను విధుల నుంచి తప్పించి, తనకు అనుకూలంగా ఉన్న కొందరు మహిళా గెస్ట్ లెక్చరర్లను మాత్రమే కొనసాగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్థులకు సర్టిఫికెట్లు కావాలన్నా, తన సబ్జెక్టులో మంచి మార్కులు పొందాలన్నా తనను వ్యక్తిగతంగా కలవాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు విద్యార్థులను తన గెస్ట్‌హౌస్‌కు రావాలని సూచిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం అయిన సందర్భాల్లో పూర్తి ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాలని లేదా తనను వ్యక్తిగతంగా కలవాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కళాశాలలోకి విద్యార్థి సంఘాల ప్రతినిధులను అనుమతించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే విధంగా తనకు నచ్చిన కొందరు విద్యార్థినులకు వీడియో కాల్స్ చేయడం, వారితో అనుచితంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా కొందరి నుంచి వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు తీవ్ర స్వభావం కలిగినవిగా ఉండటంతో సంబంధిత ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. మరోవైపు, అధ్యాపకుడి వ్యవహారశైలితో తీవ్రంగా కలత చెందిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెండు రోజుల క్రితమే తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. అయితే ఆయన రాజీనామాకు అసలు కారణాలు ఏమిటన్నది అధికారికంగా వెల్లడికాలేదు. ఈ విషయంపై కళాశాల యాజమాన్యం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా, అధ్యాపకుడి అనుచిత ప్రవర్తనపై కొందరు విద్యార్థినులతో పాటు అదే కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మరికొందరు మహిళా ఉద్యోగులు త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు కళాశాల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని సంబంధిత అధికారుల ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాల సీసీ కెమెరాల ఫుటేజీ, అధ్యాపకుల హాజరు రికార్డులు, తరగతుల నిర్వహణ వివరాలు, సర్టిఫికెట్ల జారీ రికార్డులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా వారి ఫిర్యాదులను గోప్యంగా స్వీకరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కళాశాల అంతర్గత ఫిర్యాదుల కమిటీ, సంబంధిత ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ప్రస్తుతం వెలువడుతున్నవి కేవలం ఆరోపణలు మాత్రమేనని, అధికారిక విచారణ పూర్తయ్యే వరకు వాటిని నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించరాదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకుడి వివరణను కూడా అధికారికంగా నమోదు చేయాల్సి ఉంది. విద్యార్థినులు, మహిళా ఉద్యోగుల భద్రత, గోప్యతను దృష్టిలో ఉంచుకుని వారి పేర్లు, ఫొటోలు, తరగతి వివరాలు, ఫోన్ నంబర్లు లేదా గుర్తించగల ఇతర వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించకుండా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరు 9న రావడంలేదు.. కారణం ఏంటో చెప్పిన నాగవంశీ

**వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబో చిత్రం 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా**
**షూటింగ్, పాటల చిత్రీకరణ పూర్తి కాకపోవడమే కారణమని ప్రకటన**
**క్వాలిటీ విషయంలో రాజీ పడేది లేదన్న నిర్మాత నాగవంశీ**
**ఆకస్మిక వాయిదా నిర్ణయంతో నిరాశలో వెంకీ అభిమానులు**
**రెండు, మూడు వారాల తర్వాత కొత్త తేదీపై స్పష్టత**



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఆకస్మిక పరిణామంతో వెంకటేశ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. సినిమా వాయిదాకు గల కారణాలను నిర్మాత నాగవంశీ స్పష్టంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ.. "సినిమాకు సంబంధించిన తుది దశ పనులు ఇంకా పూర్తి కాలేదు. మరో రెండు, మూడు పాటల చిత్రీకరణతో పాటు, కొన్ని కీలక సన్నివేశాల షూటింగ్ కూడా మిగిలి ఉంది. వీటికి తోడు ప్రచార కార్యక్రమాలను కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ పనులన్నీ పూర్తి చేయడానికి కనీసం రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది.. సోషల్ మీడియాలో ఎవరూ వేలెత్తి చూపకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. నిర్ణయించిన తేదీకే విడుదల చేయాలనే తొందరలో నాణ్యతతో రాజీ పడలేమని నాగవంశీ పేర్కొన్నారు. "ప్రేక్షకులతో పాటు మేం కూడా థియేటర్‌లో సినిమా ఫైనల్ కాపీ చూడటం మాకు ఇష్టం లేదు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న కాపీనే థియేటర్లకు అందిస్తాం. సినిమా నాణ్యతకే మా మొదటి ప్రాధాన్యత. అందుకే పూర్తి సంతృప్తిగా అన్ని పనులు ముగించుకుని, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం" అని ఆయన వివరించారు. ప్రస్తుతం చిత్ర బృందం మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. అయితే పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదు.

## మెగా క్రేజీ అప్‌డేట్.. చిరంజీవి 'కాకా'లో కీలకపాత్రలో బాలీవుడ్ దర్శకనటుడు

**మెగాస్టార్ చిరంజీవి 'కాకా'లో కీలక నటుడి చేరిక**
**పవర్‌ఫుల్ పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్**
**హైదరాబాద్‌లో జరుగుతున్న షూటింగ్‌లో పాల్గొన్న అనురాగ్**
**చిరంజీవి, అనురాగ్ మధ్య ఫేస్ ఆఫ్ ఆసక్తికరం**
**2027 సంక్రాంతికి జనవరి 13న సినిమా విడుదల**

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'కాకా'లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఓ అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చేరికతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. తాజాగా అనురాగ్ కశ్యప్ కూడా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఆయనతో పాటు ఇతర ప్రధాన నటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. విలక్షణమైన, పవర్‌ఫుల్ పాత్రలకు పెట్టింది పేరైన అనురాగ్ కశ్యప్, మెగాస్టార్ చిరంజీవి మధ్య తెరపై వచ్చే ముఖాముఖి సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు అంచనా వేస్తున్నారు. "ది వరల్డ్ ఆఫ్ కాకా జస్ట్ గాట్ డెడ్లియర్" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన ఈ అంచనాలకు మరింత బలం చేకూర్చింది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న 'కాకా' సినిమాపై మొదటి నుంచే భారీ ఆసక్తి నెలకొని ఉంది. ఇప్పటికే చిరంజీవి పుట్టినరోజున విడుదలైన 'కాకా' టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇప్పుడు అనురాగ్ కశ్యప్ చేరికతో ఈ ప్రాజెక్ట్ మరింత క్రేజీగా మారింది. ఈ చిత్రంలో అనశ్వర రాజన్ కూడా నటిస్తుండగా, మరికొందరు ప్రముఖ నటీనటులు కూడా భాగం కానున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు.



# ఆ దాడులకు నాకు సంబంధం లేదు.. ఐటీ సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్!

**తనపై ఐటీ దాడులు జరిగాయన్న వార్తలను ఖండించిన రకుల్**
**ఆ సోదాలు తన గురించి కాదని సోషల్ మీడియాలో స్పష్టీకరణ**
**తాను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చానని, ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరని వెల్లడి**
**విదేశీ లావాదేవీలు, బినామీ ఆస్తులతో తనకు సంబంధం లేదన్న నటి**
**తప్పుడు కథనాలు ప్రచురించిన మీడియా వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్**



తన పేరును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సోదాలతో ముడిపెడుతూ వస్తున్న వార్తలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఆ సోదాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, ఆన్‌లైన్ రిపోర్టర్లు వార్తలను సంచలనం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలను సంచలనం చేసే ధోరణి పెరుగుతుండటం బాధాకరం. అందుకే ఒకేసారి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సోదాలు నాకు సంబంధించినవి కావు" అని రకుల్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తన నేపథ్యం గురించి వివరిస్తూ.. "నేను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. ఇండస్ట్రీలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చాను. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాను" అని ఆమె తెలిపారు. ఆర్థిక అవకతవకల ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "వ్యక్తిగతంగా గానీ, ఏ నిర్మాణ సంస్థ తరఫున గానీ నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీలలో పాలుపంచుకోలేదు. దేశంలో లేదా విదేశాల్లో ఎవరి పేరు మీద కూడా నేను బినామీ ఆస్తులు కలిగి లేను. నాకు ఎవరూ ఎప్పుడూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. అలాంటి ఖరీదైన బహుమతులు తీసుకోకూడదన్నది నా నియమం" అని రకుల్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియా తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా గురించి తప్పుడు, దురుద్దేశపూర్వక కథనాలు ప్రచురించిన వారందరూ వాటిని వెనక్కి తీసుకుని, వాస్తవాలను స్పష్టం చేయాలని కోరుతున్నాను. మీడియా వ్యాపారంలో ఎంత పెద్ద సంస్థకైనా ఆర్థిక ఒత్తిళ్లు ఉంటాయని నేను అర్థం చేసుకోగలను. కానీ అది వాస్తవాలను పణంగా పెట్టి జరగకూడదు. ఒకరి ప్రతిష్ఠ, జీవనోపాధిని దెబ్బతీసేలా అసలే ఉండకూడదు" అని ఆమె హితవు పలికారు. కాగా, ముంబైలో నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాషు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ముంబై ఐటీ విభాగం సుమారు 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తనపై వచ్చిన వార్తలను రకుల్ ఖండించారు.